
# తేనెలో ముక్కలు

## పాలకొల్లు రామలింగస్వామి

అంత వరకు నెమ్మదిగా వచ్చిన ఆటో ఆ ఇంటి ముందాగింది. ఇరుగు పొరుగున ఉన్న మగవాళ్లు అది గమనించి పరుగు పరుగున ఆటో దగ్గరికి వెళ్లి అపస్మారస్థితిలో ఉన్న సింహాచలాన్ని కిందకు దించారు. ముందు...అతని కొడుకులు కాళ్లు పట్టుకుంటే, మరో ఇద్దరు అతని జబ్బలు పట్టుకుని నెమ్మదిగా దించి... ఇంటిలోకి చేర్చారు. అధునాతనంగా ఉన్న ఆ ఇంటి వసారాలో అప్పటికే పల్చగా జనం చేరారు. ధగధగ మెరసిపోతున్న మార్బుల్స్ గచ్చుపై ఎండుగడ్డి పరచి ఉంది. దానిపై .... అతికష్టమ్మీద అతన్ని పడుకోబెట్టారు.



నలుగురు మనుషులు కూడా మోయడానికి కష్టమనిపించేంత బరువు....శరీర మంతా...మందుల వాసన...చచ్చుబడిన కుడికాలూ,చేయీ.....!

ఏదో చెప్పాలని నిర్విరామంగా కదులుతోన్న నోరు......అంత అచేతన స్థితిలో నూ.....ఆ ఇంటి పరిసరాల్ని గమనించేసరికి.....అతని కళ్లల్లో లీలగా కనిపించిన నిశ్చింత!

గత మూడు రోజుల్నుంచి పట్టిన ముసురు వదలడం లేదు. ఉండుండి సన్నగా పడుతోన్న చినుకులు...చల్లని గాలులు....వాన పూర్తిగా వెలిసినట్లు అప్పటికైతే దాఖలాలు లేవు...రోడ్డంతా గుంతలు...గుంతల్లో చేరిన వర్షపు నీరు!

రాత్రంతా...ఏడ్చి...ఏడ్చి సింహాచలం భార్యాకుమారులిద్దరికీ కళ్ళు....ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. మరిక ఏడ్చేందుకు కూడా వాళ్లలో ఓపిక లేక ....తండ్రినే చూస్తూ...అతని చుట్టూ చేరారు.

''నాన్నా!...నాన్నో...పలకండి నాన్నా! ప్లీజ్...!''

అతని చిన్నకొడుకు తండ్రిని తట్టి పిలుస్తున్నా...అతనిలో ఏ విధమైన స్పందన కనపడటం లేదు. తల్లి,పెద్దకొడుకు మరిక దుఃఖాన్ని ఆపుకోలేక బోరుమన్నారు.

అంత నిశ్చలస్థితిలోనూ...అతనిలో ఇంకా ఏదో మూలన దాగిన శరీర స్పృహ! భార్యకుమారుల ఏడుపుఘోష...అతని చెవి నుంచి మెదడుకు మెల్లమెల్లగా చేరుతోంది....తన చుట్టూ చేరిన మనుషుల ముఖాలు....వారిలోని విషాద ఛాయలు...దూరం నుంచి అతనికి మసకమసకగా కనిపిస్తున్నాయి. కాని ఏం లాభం...!?

తన భావాలు గొంతు నుంచి పెదవులు దాటి బయటకు చేరని దీనావస్థ....! తన ఆలోచనలు బయటకు వ్యక్తపరచలేక...తనలోనే సమాధి అయ్యే నరక యాతన!

హమ్మయ్య! ....ఇక ఫరవాలేదు. ఎంతో ఇష్టమ్మీద కట్టించుకున్న తన కలలసౌధానికి చేరుకున్నారు...ఇక తన ప్రాణం పోయిన ఫరవాలేదు. అదిగో ఎదురుగా తన తల్లి చంద్రమ్మ! గోడపై నుంచి వేలాడే ఫోటోలోంచి తన వైపే ప్రేమగా చూస్తూ!

ప్రైవేటు గుమస్తాగా...వచ్చే అరకొర సంపాదనతో తన తండ్రి తాగుడునే తప్ప ఇంటిని....వంటిని పట్టించుకోకపోవడంతో అతికొద్దికాలంలోనే కాలం చేసినపుడు...తన తల్లి కూలీనాలీ చేసి ఇంటిని జాగ్రత్తగా నడిపించి...పిల్లలిద్దర్నీ(తనను, అన్నను) చదివించి ప్రయోజకులను చేసిన పుణ్యాత్మురాలు. అతని కనుకొలకుల్లో నెమ్మదిగా ఊరి జారుతోన్న కన్నీళ్లు!....మనసులో గతం తాలుకు జ్ఞాపకాల సుళ్లు!

***

సింహాచలానికి సొంత ఇల్లంటూ లేదు. చిన్నప్పట్నుంచి అద్దె ఇంట్లో తిరుగుతుండటమే తెలుసు. ముగ్గురు మనుషులు గల కుటుంబంలో ఒక పూట తిని...రెండు పూటలు పస్తుండే పరిస్థితులలో అద్దె ఇంట్లో అద్దె కట్టుకోలేక...సంపాదించింది చాలీచాలక తల్లి పడ్డ మానసిక వేదన...అంతా ఇంతా కాదు.

ఒకసారి తన చెవిలోని కానపర్సులను సైతం తాకట్టు పెట్టి అద్దె చెల్లించడం అతన్ని బాగా కలిచివేసింది.

'మనిషికి మంచి ప్రవర్తననేది ఎంత ముఖ్యమో...సొంత ఇల్లు కూడా అంతే ముఖ్యం' మనమేలాంటి వాళ్లమో మన ప్రవర్తన వ్యక్తపరిస్తే మన స్తోమత ఎలాంటిదో మన ఇల్లు చెబుతుంది. కాబట్టి నువ్వు జీవితంలో స్థిరపడ్డాక అప్పోసప్పో చేసి నీకంటూ సొంతిల్లు కట్టుకోరా నాయినా!'' తన తల్లి చివరి రోజులలో చెప్పిన మాటలు.

సింహాచలం ఎమ్మార్వో ఆఫీసులో ప్యూనుగా చేరి మరో మూడేళ్లలో రిటైరవుతాడన్నంతవరకు గానీ నెరవేరలేదు. అంతేకాకుండా తన తల్లి స్మృత్యర్థం ఇంటికి 'చంద్రమ్మ నిలయం' అన్న పేరు కూడా పెట్టాడు.

సింహాచలం ఉన్నంతలో ఇంటిని బాగానే కట్టించాడు. స్థలాన్ని ఒక రియల్ ఎస్టేటులో వాయిదాల పద్ధతిలో కొన్నాడు. అది ఖరీదైన ప్రాంతం కాబట్టి ఇల్లు కూడా భారీగానే ఉండాలని భావించి ''విశాలమైన రెండు గదులతో పాటు మార్బుల్స్ వేయించి మరీ కట్టించాడు. తను నెల నెలా కూడబెట్టిన డబ్బుతో పాటు ...బ్యాంకులోను తీసుకుని మరీ ధైర్యం చేసి ఇంటిని పూర్తి చేశాడు.

ఇంటి నిర్మాణం అంటే తన తల్లి యొక్క నిలువెత్తు జ్ఞాపక చిహ్నంగా సింహాచలం భావించబట్టే...అందులోని ప్రతి అంగుళమూ తనకిష్టమైన రీతిలో.....తాపీ మేస్త్రీలకు చెప్పి దగ్గరుండి మరీ నిర్మించాడు.

అందుకే కొత్త ఇల్లంటే కించిత్ గర్వం....ఒక విధమైన మైమరపు...రోజూ ఇంటిని చూస్తూ జ్ఞప్తికి తెచ్చుకుంటూ....పదిమందితో గొప్పగా చెప్పడమూ అతని దినచర్యలో ఒక భాగం. ఇదంతా నచ్చని సింహాచలం భార్య సుబ్బమ్మ ఓ సారి భర్తను పట్టుకుని దులిపింది.

''ఏమయ్యోయ్!.....దేశంలో నువ్వొక్కడివే ఇల్లు కట్టించినట్లు...ఎందుకలా ఊరికే...గొప్పయిపోతన్నావ్...!? కొంచెం తగ్గవయ్యా....! తగ్గు...ఎవరైనా చూస్తే నవ్విపోగలరు?''

పాతికేళ్లుగా తెలిసిన భార్య మాట తీరుకు చిన్నగా నవ్వాడు సింహాచలం. ''నవ్వితే..నవ్వనీ...నాకేం చిన్నతనం లేదు. సొంతిల్లు కట్టుకోవాలన్నది నా చిరకాల కోరిక మాత్రమే కాదు. చనిపోయిన మా అమ్మ ఆశయం కూడా...అది తీరింది...కల నిజమై కళ్లెదుట నిలిచినపుడు కలిగే ఆనందం,తృప్తి అంతా ఇంతా కాదు...అది మీకెవ్వరికీ అర్థం కాదు!'' తడుముకోకుండా స్థిమితంగా జవాబిచ్చాడు సింహాచలం.

సుబ్బమ్మకు అతని సమాధానం రుచించకపోడంతో మూతిమూడు వంకరలు తిప్పింది.

''ఓ..చాల్లేవయ్యా...సంబడం...ఏదో పెద్ద ఘనకార్యం సాధించినట్టు!...ఇల్లు కట్టడం కూడా ఘనకార్యమేనా!? అంది సుబ్బమ్మ పెద్దగా!



"పోనీలే అమ్మా!...నాన్న పాతతరం మనిషి...ఆయన భావాలు అలాగే ఉంటాయి. వాటిని కాదనగూడదు!" అప్పుడే అక్కడకు వచ్చిన పెద్దకొడుకు నవ్వుతూ అన్నాడు. ఆ మాటకు సుబ్బమ్మ మౌనంగా ఊరుకుంది. ఏం మాట్లాడకుండా!

"నేనన్నానని కాదుగానీ....ఒక్క విషయం ఆలోచించి చెప్పరా నాయినా!....ఇప్పటి తరంలో తనకు చెందిన వస్తు ప్రపంచం గురించి 'నాది' అనే ఆత్మీయ భావన ఎంతమందిలో ఉంది చెప్పు....!? రోజుకొకటి... గంటకొకటి కొనడం...వాడటం....అవసరం తీరాక పారేయడం....! మా చిన్నప్పటి రోజులలో అయితే ఫోర్త్‌ఫామ్ పరీక్షలను రాసిన పెన్నును సైతం భద్రంగా దాచుకునే వాళ్లం...మరి ఇప్పుడో!...తమ ముందుతరం ఇచ్చిన గృహోపకరణాలను ఇప్పటి తరంలో ఎంత మంది వాడుతున్నారో చెప్పు....! ఇప్పటిదంతా ఫాస్ట్ జనరేషన్! వారికి అటాచ్‌మెంట్‌తో పని లేదు. వస్తువులతో ప్రయోజనం నెరవేరడమే ముఖ్యం. ఇప్పుడంతా ఎక్కడ చూసినా వస్తు వినిమయ సంస్కృతి తప్ప మరేది కనిపించడం లేదు....అయినా నా పిచ్చిగానీ మనుషుల మధ్య అనుబంధాలే రాన్రాను మాయమైపోతున్నపుడు...వస్తువుకు, మనిషికి మధ్య గల అనుబంధాల గురించి మాట్లాడటంలో అర్థం లేదు.

చిన్న సైజు ఉపన్యాసం లాంటిది చెప్పాడు సింహాచలం.

ఈ సృష్టిలో పనికిరాని వస్తువేది లేదని, దాన్ని ఉపయోగించుకునే నేర్పు ఉండాలేగానీ...ఏదీ వ్యర్థం కాదనేది అతని అభిప్రాయం. అంతేకాదు అతను ఉపయోగించే ప్రతి వస్తువును అతి భద్రంగా వాడటమే కాకుండా...వాటిని పక్కన పెట్టేయడానికి, పారేయ్యడానికి అతని మనసు ఒప్పుకోదు. కుర్చీ, మంచం, టేబుల్, సైకిల్...ఇలా ఏవీ అతను మార్చలేదు. అతని తత్వానికి కుటుంబ సభ్యులు కూడా అలవాటు పడిపోయారు... చాన్నాళ్లే అయింది.

"నిజమే నాన్నా!...నువ్వు చెప్పిందంతా నిజమే!"

నాన్న 'ఒట్టి సెంటిమెంటల్‌ఫూల్' అని మనసులో అనుకుంటూనే పైకి ముక్తసరిగా అన్నాడు పెద్దకొడుకు.

"కాబట్టివ్వ నే చెప్పేదేమిటంటే...మనకెంతో ప్రీతిపాత్రమైన, అపురూపమైన ఈ ఇంటిని జాగ్రత్తగా చూసుకోవాలి....ఎప్పటికీ మన ఆధీనంలోనే ఉండాలి. ఉద్యోగరీత్యా మీరు ఎక్కడ ఉన్నా...సెటిలైనా...! నేనున్నా... లేకపోయినా... దీన్ని మీరు పదిలంగా చూసుకోవాలి. అర్థమైందా!? ఈ ఇంటిలోనే తిరుగాడుతూ... నా బొందిలో ప్రాణం..... ఈ ఇంటి నుంచే పోవాలి....అదే నా చివరి కోరిక!" జీరబోయిన గొంతుతో భావోద్వేగంగా అన్నాడు సింహాచలం.

"సర్లెండి!...అవన్నీ ఇప్పుడెందుకు! భోజనానికి లేవండి!" వంటింట్లోకి ఇరి తీస్తూ అనునయంగా అంది సుబ్బమ్మ.

***

సాయంత్రమైంది....ఉదయం నుంచి మబ్బుగా ఉన్న వాతావరణం పూర్తిగా మారిపోయింది. వర్షం ఒక్కసారిగా జోరుగా కురవడంతో పాటు ముసురులా పట్టుకుంది.

మధ్యాహ్నం చేసిన భోజనం....జీర్ణం కాక పోవడంతో సింహాచలానికి వాంతులు,విరేచనాలు పట్టుకున్నాయి. బాగా నీరసించి పోవడంతో డాక్టరు దగ్గరికి అతన్ని తీసుకెళ్లారు. బయట వర్షం అడపాదడపా కురుస్తూనే ఉంది. సెలైన్ బాటిల్స్‌తో మొదలైన వైద్యం....సింహాచలానికి వాంతులు,విరేచనాలను తగ్గించాయి కానీ...అతనికి కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయి. దాంతో తగిన వైద్యం చేయడానికి తన దగ్గర ఎక్విప్‌మెంట్ లేని కారణంగా వేరే పెద్ద డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్లమని సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నాడు డాక్టరు.

అప్పుడు రాత్రి పదకొండు గంటలు....

పెద్ద డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లేలోగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అంతవరకూ మాట్లాడిన సింహాచలం మరిక మాట్లాడ లేకపోయాడు. శరీరం చల్లబడటమే కాకుండా స్వాధీనం తప్పుతోంది. మాటల్లో లోపించిన స్పష్టత....నోరు కూడా దాదాపుగా వంకర్లు తిరిగిపోయింది.

సింహాచలాన్ని నిశితంగా పరిశీలించిన డాక్టరు బ్లడ్‌షుగర్, బ్లడ్ ప్రషర్ బాగా పెరిగిపోవడంతో... బ్రెయిన్‌హెమరేజ్ వచ్చిందనీ.....దాని వలన మైల్డ్ పెరాలసిస్ స్ట్రోకు కూడా వచ్చిందనీ, అందు చేత తను చేయవలసిన వైద్యం చేస్తానని...ఆపై దేవుడి దయ అని ముందుగానే చెప్పి వైద్యం మొదలు పెట్టాడు.

రెండు రోజులు దాటి...మూడో రోజు కూడా వైద్యం కొనసాగింది. కాని సింహాచలం ఆరోగ్య పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు.

మరుసటి రోజు రాత్రి...చివరిసారిగా సింహాచలాన్ని పరీక్షించిన డాక్టరు ...ఇక లాభం లేదని, అతన్ని ఇంటికి తీసుకెళ్లిపోవచ్చని తేల్చి చెప్పేశాడు. ఆ మాట విని భార్యాపిల్లలు ముగ్గురూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. తెల్లవార్లూ......బయట వాన జల్లుకూ లోపల వారి కన్నీళ్లకు అడ్డుకట్ట లేనే లేదు.

అలా....అలాంటి దయనీయ పరిస్థితులలో...ఇంటికి చేర్చబడ్డ సింహాచలాన్ని కడసారిగా చూసేందుకు జనం వచ్చిపోతున్నారు. జరిగింది తెలుసుకుని బాధపడి కుటుంబ సభ్యులను పరామర్శించి పోతున్నారు.

ఆ వీధిలోని స్థానిక వైద్యుడొకడు వచ్చి అతని నాడీ పరిశీలించి చూశాడు. సాయంత్రం నాలుగ గంటల లోపే ప్రాణం పోవచ్చునని నిర్ధారించి వెళ్లిపోయాడు. ఒక్క ఎగ ఊపిరి తప్ప సింహాచలంలో ఏ జీవక్రియ లేదు!

సమయం మధ్యాహ్నం రెండు గంటలు....

వీధి అంతటా నిశ్శబ్దం....అందరిలోనూ గూడు కట్టిన విషాదం...

ఎక్కడ చూసినా...అతని...గురించి చర్చలే!

"సింహాచలం లాంటి మంచి మనిషికి ఇలా జరిగి ఉండాల్సింది కాదు...ఏం చేస్తాం!? అతగాని చావు అలా రాసి పెట్టి వుంది!"

"మంచి మనుషులను దేవుడు తొందరగా తన దగ్గరికి రప్పించుకుంటాడంటారు...అది నిజమేనర్రా!"

"ఇల్లు కట్టి సంవత్సరం కాలేదు. అప్పుడే ఇలా జరగడం దారుణం!"

"ఇంట్లో దిగినపుడు పెద్దపెద్ద వాళ్లను పిలిచాడు. ఫంక్షన్ గ్రాండ్‌గానే చేశాడు. అతగాని మంచితనం వలన అందరూ వచ్చారు. అప్పుడే ఇలా జరగడమేమిటి!? ఏదైమైనా ఈ ఇంటి గురించి బాగా తెలిసిన వాళ్లను ఓ సారి అడగడం మంచిది!"

"అతగాని తల రాతకు ఇల్లేం చేసింది!?...మీవన్నీ వట్టి మూఢ నమ్మకాలు...అందేం కాదు!"

"సింహాచలం ఎంత ఇష్టమ్మీద ఇల్లు కట్టించుకున్నాడు? పాపం! కనీసం ఒక సంవత్సరం పాటైనా ఇంట్లో మెసిలిన బావుణ్ణు!...అతని కోరిక తీరిపోను!"

"అవునూ....!? ఈ రోజు ఏం వారం తెలుసా!? మంగళవారం...అమావాస్య...అశ్వినీ నక్షత్రం...ఏవీ మంచివి కావు!"

"అయితే ఏంటట....!?

"ఏంవిటని మెల్లిగా అడుగుతాఁవేంటయ్యా! ఇంటిని తక్షణం ఖాళీ చేసి వాళ్లంతా ఏడాది పాటు దూరంగా ఎక్కడికో వెళ్లిపోవాలి. వీధికి కూడా అరిష్టం! తెల్సా...!?

"అరెరె..! అలాగా!.... ఈ విషయం సుబ్బమ్మకు తెలుసో....తెలియదో.....!"

క్రమేపి ఈ విషయం సుబ్బమ్మ చెవికి సోకింది. వెంటనే తన కొడుకులిద్దరితో చెప్పి వివరంగా చర్చించింది. తండ్రి అకాల మరణానికి కారణభూతమవుతున్న ఈ కొత్త ఇల్లు మీకు అచ్చిరాదని, ఇంటిని వదిలించుకోవడమే ఉత్తమమని, ఇంతలో ఎవరో ఒక పెద్దాన అంతలోనే ఉచిత సలహా ఇచ్చేశాడు.

భార్యా కుమారులు ముగ్గురూ ఆలోచనలో పడ్డారు. ప్రస్తుతానికి తండ్రి శరీరాన్ని ఇంటి నుంచి దూరంగా ఉన్న పశువుల పాకలోకి తరలించాలని....నిర్ణయించుకున్నారు.

మనసుకు కష్టమనిపించినా...తప్పని కఠోర నిర్ణయం....

సమయం మించిపోతోంది....ఇద్దరు కొడుకులు అక్కడ్నుంచి లేచారు. ఇంటికెదురుగా ఉన్న పశువుల పాకలో దట్టంగా గడ్డిని పరిచారు. దానిపై వేయడానికని సింహాచలాన్ని కొడుకులు, మరో ఇద్దరు అతి కష్టమ్మీద తలో పక్క ఎత్తి పట్టుకుని, ముందుకు రెండడుగులు వేశారు....అంతే!

సింహాచలం ముఖంలో ఒక్కసారిగా పెరిగిన ఆందోళన...చెరువులో చేపను ఒడ్డున పడేసినపుడు...కలిగే జీవన్మరణ యాతనలా.....!

హడావుడిగా అస్తవ్యస్తంగా గడ్డి పరచిన నేలపై అతన్ని ఇలా వేశారో లేదో అతనిలో మరిక చలనం లేదు...ఒకే ఒక ధీర్ఘ శ్వాస...ప్రాణం పోయిందని ఎవరో అన్నారు.

మళ్లీ అమాంతంగా చుట్టుముట్టిన ఏడ్పు ఘోష.

ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో వర్షం కూడా పుంజుకుంది....

"తను అమితంగా ప్రేమించిన ఇంటి నుంచి తనను దూరం చేసేసరికి...భరించలేక ప్రాణం వదిలేశాడు! పాపం సింహాచలం!" ఎవరో అన్నమాట తమ చెవిన పడ్డా...పడనట్టే ఊరుకున్నారు.....ఆ ముగ్గురూ....!

◆